

వేతనం పెంచరు.. క్రమబద్ధీకరించరు

● దయనీయంగా సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగుల పరిస్థితి ● జిల్లాలో 54మంది సీఆర్పీలు



బడి వయట పిల్లలను గుర్తిస్తున్న సీఆర్పీ

వాంకిడి, ఫిబ్రవరి 29: విద్యాశాఖలో పదమూడేళ్లుగా పనిచేస్తున్న సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగభద్రత కల్పించి సమానపనికి సమానవేతనం ఇవ్వాలని గతంలో అధికారులు, ప్రభుత్వానికి వినతిపత్రాలు అందించారు. అయినా స్పందన లేకపోవడంతో 2023 ఆగస్టు 17నుంచి 45రోజుల పాటు సామూహిక రిలే నిరాహార దీక్షలు చేశారు. దీక్షలు విరమించి విధుల్లో చేరితేనే చర్చలు జరుపుతామని గత ప్రభుత్వం ప్రకటించడంతో విధుల్లో చేరారు. తరువాత ఎన్నికలు రావడం, కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది.

జిల్లాలో 54మంది సీఆర్పీలు పనిచేస్తున్నారు. క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్పీ)లను స్కూల్ అసిస్టెంట్లకు సమానమైన విద్యార్హతతో నియమించారు. డిగ్రీ, బీఈడీ, టెట్, పీజీ పూర్తిచేసిన వారు సీఆర్పీలుగా పనిచేస్తున్నారు. వీరికి నెలకు వేతనం రూ.19,350 మాత్రమే చెల్లిస్తున్నారు. అదేవిధంగా కేజీబీవీ, యూఆర్ ఎస్లో టీచింగ్, నాన్‌టీచింగ్, కంప్యూటరు ఆపరేటర్లు, ఎంఐఎస్ సమన్వయ కర్తలు, ఐఈఆర్పీలు, పీటీఐ, ఎమ్మార్సీ మెసేంజర్స్ తదితరులు కూడా పనిచేస్తున్నారు. వీరంతా వేతనాలు పెంచడంతో పాటు క్రమబద్ధీకరించాలని ఎంతోకాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. విద్యారంగంలో నిర్వహించే పనులతోపాటు ప్రభుత్వం నిర్వహించే ఇతర కార్యక్రమాలకు కూడా వీరిని వినియోగించుకుంటున్నారు. మహిళా ఉద్యోగులకు ఆరునెలలకు ప్రసూతిసెలవులు మంజూరు చేసి క్లస్టర్ల సంఖ్యను పెంచడంతో పాటు పలు సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

● ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- దుర్గం సందీప్, సీఆర్పీల సంఘం జిల్లా కోశాధికారి



విద్యాశాఖలో పనిచేస్తున్న మాకు ఉద్యోగ భద్రత కల్పించి తగిన వేతనం చెల్లించాలి. ఉపాధ్యాయుడికి ఉండాల్సిన అర్హతతో కాంట్రాక్టుపద్ధతిలో సీఆర్ పీలను తీసుకున్నారు. 13సంవత్సరాలుగా చాలీచాలనీ వేతనాలతో పని చేస్తున్నాము. ప్రభుత్వం తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించే సౌకర్యాలను కల్పించాలి.

సీఆర్పీలు కీలకం..

జిల్లావ్యాప్తంగా 54మంది సీఆర్పీలు మండల విద్యాశాఖపరిధిలో పనిచేస్తున్నారు. వీరిని కాంప్లెక్స్ హెచ్ఎంలకు కేటాయించారు. జిల్లాలో ఒక్కో సీఆర్పీ వారి క్లస్టర్ పరిధిలో 15పాఠశాలలను సందిర్శిస్తుండ డమే కాకుండా పాఠశాలల సంఖ్యకు అనుగుణంగా సందర్శిస్తూ ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుతోపాటు మధ్యాహ్న భోజన వివరాలను పరిశీలిస్తారు. సమగ్రశిక్షా అభియాన్‌లో భాగంగా బడిబయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పిస్తారు. పాఠశాలల నుంచి విద్యార్థుల వివరాలు సేకరించి యూడైస్‌లో నమోదు చేస్తారు. సమగ్రశిక్షా అభియాన్ ద్వారా నిర్వహించే కార్యక్రమాలు పాఠశాలల్లో అమలు అయ్యేలా చూస్తారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లోని ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్లినపుడు ఆ క్లస్టర్ పరిధిలోని సీఆర్పీ ఆ పాఠశాలను నడిపిస్తారు. ప్రతినెల పాఠశాల యాజమాన్యకమిటీ సమావేశం ఏర్పాటు చేసి వివరాలను నమోదు చేస్తారు. స్కూల్‌కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించి, పాఠశాల ఖర్చుల వివరాలు సేకరించి జిల్లా విద్యాశాఖాధిరులకు అందజేస్తూ కీలకంగా వ్యవహరిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సీఆర్పీలతో పాటు విద్యాశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని కోరుతున్నారు.

రోడ్డు నిర్మించాలని గ్రామస్థుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న ఖమాన గ్రామస్థులు

వాంకిడి, ఫిబ్రవరి 29: మండలంలోని ఖమాన గ్రామం వరకు బీటీరోడ్డు నిర్మించాలని గురువారం ఖమాన గ్రామస్థులు ఎడ్లబండ్లను రోడ్డుకు అడ్డంగా పెట్టి బైఠాయించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గతేడాది రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరై టెండర్లు పూర్తైనప్పటికీ నేటివరకు పనులు ప్రారంభించలేదన్నారు. కాంట్రాక్టర్‌రోడ్డుకు ఇరువైపులా మొరం వేసి కనిపించకుండా పోయాడన్నారు. దీంతో రాకపోకలకు తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. పలుమార్లు కలెక్టర్, అధికారులకు వినతిపత్రాలు అందించినా ఎవరు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారులు ఇకనైనా స్పందించి రోడ్డు నిర్మించకపోతే పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. సీఐ శ్రీనివాస్ రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులతో చర్చలు జరిపి రోడ్డు నిర్మించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఐసీడీఎస్‌లో రూ.65 లక్షల అవినీతి

జైనూర్, ఫిబ్రవరి 29: అంగన్‌వాడీకేంద్రాలకు 2015-2016లో అప్పటి సీడీపీవో శ్రీదేవి పాలనలో పాలు సప్లయి చేయకుండానే రూ.65లక్షలు కాజేసినట్లు విచారణలో తేలిందని జైనూరు సీడీపీవో ఇందిర గురువారం తెలిపారు. అదేవిధంగా అక్రమాలకు పాల్పడిన సీడీపీవోపై ఇటీవల వరంగల్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారని, కార్యాయలంలోని పలు రకాల కాగితాలను స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. దీంతో పాటు విజిలెన్స్ ఏసీబీ అధికారులు పలు దఫాలుగా విచారణ చేసినట్లు ఆమె తెలిపారు.

విద్యార్థులు ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం కావాలి

వాంకిడి, ఫిబ్రవరి 29: విద్యార్థులు ప్రణాళికతో పరీక్షలకు సన్నద్ధం కావాలని ప్రధానోపాధ్యాయుడు నటరాజన్ అన్నారు. షెడ్యూల్‌కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో గురువారం ఎస్సీ బాలుర వసతిగృహంలో విద్యార్థులకు ఓరియంటేషన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ పరీక్షల పట్ల ఉన్న భయం నిద్రలేక పోవడం వంటి అనేక సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు భయాన్ని వీడి పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగదీష్, మమత, తదితరులు పాల్గొన్నారు.

మీడియాఅకాడమీ చైర్మన్‌ను కలిసిన టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు



శ్రీనివాసరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రహెమాన్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 29: తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా ఎన్నికైన కె శ్రీనివాస్ రెడ్డిని గురువారం టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు రహెమాన్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇంటి స్థలాలు, ఇళ్లు, హెల్త్ కార్డులు తదితర సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి



డీఆర్వో లోకేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 29: భవననిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డీఆర్వో లోకేశ్వర్‌కు గురువారం ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. దేశవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకుల దివాక్, శంకర్, చిరంజీవి, భాస్కర్ పాల్గొన్నారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

కెరమెరి, ఫిబ్రవరి 29: పదవతరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఏటీడీవో పురుషోత్తం అన్నారు. గురువారం ఆయన అనార్‌పల్లి, మోడి, రాంజీగూడ ఆశ్రమపాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవతరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. నూతన మెనూప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. ఆయనవెంట ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత, వసంత్, లింబారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

కెరమెరి, ఫిబ్రవరి 29: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. 146మంది విద్యార్థులకు గాను ఒక్కరు గైర్హాజరయినట్లు సీఎస్ పురుషోత్తం, డీవో సునీల్ తెలిపారు. పరీక్షాకేంద్రాన్ని అధికారులు శంకర్, రాజయ్య, ఎస్సై విజయ్ పరిశీలించారు.

దేహదారుఢ్యానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయి

● ఎస్పీ సురేష్‌కుమార్



పోలీసు క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 29: పోలీసుల దేహదారుఢ్యానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ సాయుధబలగాలకు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించగా ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల మానసికోల్లాసం కోసం వాలీబాల్ టోర్నమెంట్ ఏర్పాటు చేశామన్నారు. సిబ్బందిలో నూతనఉత్సాహం పెంచేందుకు ఈటోర్నమెంట్ ఏర్పాటు చేశామన్నారు. విధుల్లో ఒత్తిడినుంచి బయట పడడానికి శారీరకదృఢత్వాన్ని క్రీడలు తోడ్ప డతాయన్నారు. క్రీడలు మనలో దాగిఉన్న శక్తిసామర్థ్యాలను, పోరాట పటిమను వెలికి తీస్తాయన్నారు. పోలీసులు వ్యాయమాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. అనంతరం క్రీడాకారులను పరి చయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐ రాణాప్రతాప్, ఆర్ఐ పెద్దన్న, సీఐలు సతీష్, శ్రీనివాస్, ఆర్ఐఎంటీ అంజన్న, ఆర్ఐ షేక్ నాగుల్ మేర, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.

పిల్లలు ఆకాశమే హద్దుగా ఎదగాలి: డీఈవో



కిట్‌ను పంపిణీ చేస్తున్న డీఈవో, సంస్థ సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 29: ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఆకాశమేహద్దుగా ఎదగాలని డీఈవో అశోక్ అన్నారు. గురువారం జడ్పీఎస్ బాలురపాఠశాలలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్‌విత్ డిసేబులిటీస్ ఆధ్వర్యంలో మానసిక విద్యార్థులకు బోధన, అభ్యసన సామాగ్రి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన అభ్యసన సామాగ్రిని ఏ విధంగా వినియోగించుకోవాలో విలీనవిద్య రిసోర్స్‌పర్సన్స్ శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు వాటిని వినియోగించుకొని అందరితో సమానంగా ఆకాశమే హద్దుగా ఎదిగాలని కోరారు. ఎల్‌బిసీ ఐడీ ప్రతినిధి శ్యాం ఈ కిట్లను డీఈవోకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుకర్, అబిదలీ, ప్రధానోపాధ్యాయుడు కాలిక్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 29: మండలంలోని కొమ్ముగూడ, బూర్గుడ, చోర్పల్లి గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ రాథోడ్ గణేష్ సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమ్ముగూడ గ్రామంలో మూడు లక్షలు, చోరపల్లి గ్రామంలో మూడు లక్షల ఎన్‌జీఆర్‌ఎఫ్ నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సత్తయ్య, నిజాం, ఇస్మాయిల్, తిరుపతి పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ రాథోడ్ గణేష్

నేడు రైల్వేగేటు మూసివేత

సిర్పూర్(టి), ఫిబ్రవరి 29: మండలంలోని వేంపల్లి సమీపంలోని కాగజ్‌నగర్-సిర్పూర్(టి) ప్రధాన రహదారిపై ఉన్న రైల్వేగేటు వద్ద బ్రిడ్జిపనులు నడుస్తున్నందన శుక్రవారం రాత్రి 8గంటల ఉంచి శనివారం ఉదయం వరకు రైల్వేగేటు మూసివేస్తామని ఎస్సై దీకొండరమేష్ తెలిపారు. ప్రజలు, ప్రయాణికులు గమనించి పెద్దబండ, చింతకుంట, చుంచుపల్లి మీదుగా కాగజ్‌నగర్‌కు వెళ్లాలని కోరారు.

అత్యుత్తమ ఫలితాలు సాధించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 29: పదోతరగతి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని జిల్లావిద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలో భౌతిక, రసాయన, జీవశాస్త్రం ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న కాంప్లెక్స్‌మీటింగ్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత సంవత్సరంలో వచ్చిన ప్రశ్నపత్రాలను విద్యార్థుల చేత బాగాప్రాక్టీస్ చేయించాలన్నారు. భౌతిక, రసాయనశాస్త్రం అంటే భయంలేకుండా విద్యార్థులకు సులభంగా ఉత్తీర్ణులయ్యేలా బోధించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుభాష్‌బాబు, ఆర్పీలు రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులకు అవార్డులు

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 29: ఆశ్రమపాఠశాలల్లో విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తమఫలితాలు సాధంచేలా కృషిచేసిన ఉపాధ్యాయులను గుర్తించి రివార్డులు, అవార్డులు అందిస్తామని గిరిజనసంక్షేమ ఉపసంచాలకులు ఆర్ రమాదేవి అన్నారు. బుధవారం రాత్రి జిల్లాకేంద్రంలోని ఆదర్శ క్రీడా పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా ఆశ్రమ పాఠశాలల్లో పదవ తరగతిలో ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు వేర్వేరుగా అవార్డులు అందించనున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, డీఎస్‌వో మీనారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు, కోచ్ విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, ఉపాధ్యాయులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

లింగాపూర్, ఫిబ్రవరి 29: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహణ కలిగి ఉండాలని మండల ఆర్‌ఐలు ప్రకాష్, ప్రదీప్ అన్నారు. గురువారం మండలంలోని ఏల్లాపటార్ గ్రామపంచాయతీ పరిధిలోని రామునాయక్‌తండాలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యాక్రమానికి వారు హాజరై గ్రామస్థులకు అవగహణ కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతరాజ్యాంగంలోని చట్టాలను ప్రతి పౌరుడు గౌరవిస్తూ వాటిని అచరణలోకి తీసుకురావాలని అన్నారు. పౌరులు వ్యక్తిగత జీవనశైలి విధానాలను, సామాజిక బాధ్యత లపై పూర్తి అవగాహణ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రూ.కోటి 5లక్షలతో మండలాభివృద్ధి పనులు

లింగాపూర్, ఫిబ్రవరి 29: మండలానికి జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకంలో రూ.కోటి 5లక్షలు మంజూరయ్యాయని మండల జడ్పీటీసీ ఆడే రక్కుబాయిలక్ష్మాయక్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పలుగ్రామాల్లో సీసీ రోడ్లకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గురుకుల లెక్చరర్లుగా ఎంపికైన బీట్ ఆఫీసర్‌లు

బెజ్జూరు, ఫిబ్రవరి 29: బెజ్జూరు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు గురుకుల లెక్చరర్‌లుగా ఎంపికయ్యారు. కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలోని బెజ్జూరు రేంజ్ ఇందూర్‌గాంలో పనిచేస్తున్న బీట్ ఆఫీసర్ శ్రీధర్ గురుకుల డిగ్రీలెక్చరర్‌గా, సుస్మీర్ బీట్ అధికారిగా పని చేస్తున్న ముత్యం జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన డిగ్రీ, ఇంటర్ లెక్చరర్ ఫలితాల్లో వీరు ఎంపికయ్యారు.



శ్రీధర్



మైనింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం ఇస్తున్న మైనింగ్ సిబ్బంది

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 29: సమస్యలు పరిష్కరించాలని మైనింగ్ సిబ్బంది గురువారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఉద్యోగ నోటిఫికేషన్‌ను రద్దుచేసి అంతర్గతంగా ఉన్నఉద్యోగులను ఆయాపోస్టుల్లో తీసుకోవాలని, సీనియర్ మైనింగ్‌సర్దార్‌గా మూడేళ్లసర్వీసు పూర్తిచేసినవారికి, మిగిలినవారిలో ప్రస్తుత గ్రేడ్‌లో ఒక ఇంక్రిమెంట్‌యొక్క ఫిట్‌మెంట్‌తో గడువుతేదీతో అమలు చేయాలన్నారు. మైనింగ్ డిప్లొమాకలిగిన ఇన్‌సర్వీస్ అభ్యర్థులకు ఫాస్ట్‌ట్రాక్ ప్రాతిపదికన ఎస్ఎఫ్-సీగా నియమించాలని, తదితర డిమాండ్లను పేర్కొంటూ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కె రాజ్‌కుమార్, మైనింగ్‌సిబ్బంది అన్వేష్ రెడ్డి, మారేపల్లి బాబు, బాలక్రిష్ణ, శివ, దేవానంద్, సాయినాథ్, చందు, తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే అవకాశం కల్పించాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 29: సర్ఫేస్ జనరల్ పోస్టులకు పాత పద్ధతిలోనే అవకాశం కల్పించాలని జనరల్ మజ్దూర్లు కోరారు. ఈ మేరకు గురువారం వారు జీఎం బి సంజీవరెడ్డికి వినతిపత్రం అందించారు. అన్ని కేటగిరీల వారికి కాకుండా అండర్‌గ్రౌండ్ జనరల్ మజ్దూర్లకే మొట్టమొదట అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సందేశ్‌కుమార్, వేణు, మహేష్, శ్రీనివాస్, సందీప్ కుమార్, సందీప్ రెడ్డి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించాలి: జీఎం



మాట్లాడుతున్న జీఎం మనోహర్

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 29: మందమర్రి ఏరియాకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 47.10లక్షల టన్నుల ఉత్పత్తిని అనుకున్నదానికంటే ముందే సాధించామని జీఎం మనోహర్ తెలిపారు. గురువారం జీఎంకార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరివరకు 37లక్షలటన్నులు సాధించామన్నారు. 10లక్షలటన్నుల ఉత్పత్తి వెనుకబడి ఉన్నామని పేర్కొన్నారు. కార్మికులు, ఉద్యోగులు, అధికారులు అనే తేడాలేకుండా అందరూ అంకిత భావంతో పనిచేస్తే ఉత్పత్తిలక్ష్యాలను సులువుగా అధిగమించవచ్చన్నారు. అంతేకాకుండా అదనపు ఉత్పత్తిని కూడా సాధించేందుకు కృషిచేయాలని పేర్కొన్నారు. శాంతిఖని, కేకేఓసీకాసిపేట2, కాసిపేట1గనులు నిర్దేశించిన లక్ష్యాలను వీలైనంత త్వరగా సాధించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలకు కేవలం ఒకనెల మాత్రమే సమయం ఉందన్నారు. ఏరియా లాభాల బాటలో నడవాలంటే తప్పనిసరిగా అదనపు ఉత్పత్తి సాధించి తీరాలన్నారు. సమావేశంలో పీఎం శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఓసీపీ పీవో

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 29 : శ్రీరాంపూర్ ఓసీపీ ప్రాజెక్ట్ అధికారిగా తాడేబోయిన శ్రీనివాస్ గురువారం బాధ్యతలుస్వీకరించారు. ముందుగా ఆయన గనిఆవరణలోని మైసమ్మతల్లి ఆలయంలో పూజలు చేశారు. తరువాత బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఉద్యోగులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేనేజర్ సుధీర్, ప్రాజెక్ట్‌ఇంజనీర్ చంద్రశేఖర్, రక్షణాధికారిశ్రీనివాస్, క్వాలిటీ ఇన్‌చార్జి కె. వెంకటేశ్వర్ రెడ్డి, సంక్షేమాధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశాన్ని బహిష్కరించిన ఏఐటీయూసీ

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 29: ఎస్ఆర్పీ1 గనిపై గురువారం నిర్వహించిన రక్షణ కమిటీ సమావేశాన్ని ఏఐటీయూసీ నాయకులు బహిష్కరించారు. అనంతరం బ్రాంచ్‌కార్యదర్శి బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య మాట్లాడుతూ గతసమావేశంలో పేర్కొన్న సమస్యలను పరిష్కరించడంలో మేనేజర్ విజయ్‌కుమార్ విఫలమయ్యారని ఆరోపించారు. వెంటనేసమస్యలు పరిష్కరించకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దాడి రాజయ్య, కామెర వేణు, మారేపల్లి బాపు, పరశురాములు, రక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పదవీ విరమణ కార్మికులకు సన్మానం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 29: శ్రీరాంపూర్ ఏరియాలోని గనుల్లో వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారిని అధికారులు, సహచర కార్మికులు ఘనంగా సన్మానించారు. ఆర్కే6 గనిపై నలుగురు ఉద్యోగులను మేనేజర్ తిరుపతి, సంక్షేమాధికారి సునీల్ కుమార్, ఆర్కె న్యూటెక్ గనిలో ట్రామర్ లక్ష్మారెడ్డిని మేనేజర్ స్వామి రాజు, సంక్షేమాధికారి పాల్ సృజన్, తదితరులు సన్మానించారు. ఎస్ఆర్పీ1 గనిపై ముగ్గురు ఉద్యోగులను మేనేజర్ విజయ్ కుమార్, సంక్షేమాధికారి రాజు, నాయకులు, ఆర్‌కెగనిపై నలుగురు ఉద్యోగులను మేనేజర్ శ్రీధర్, సంక్షేమాధికారి శంతన్, యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు.

బెల్లంపల్లి: పట్టణంలోని శాంతిఖని గనిలో పదవీవిరమణ పొందిన కార్మికులు మల్లేష్, హనుమయ్య, షేక్ గోరిని అధికారులు గురువారం గనిలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గని మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా, రక్షణాధికారి రాజు, పిట్ ఇంజనీర్ రాంబాబు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆపరేటర్ కుటుంబానికి చేయూత

దండేపల్లి, ఫిబ్రవరి 29 : దండేపల్లి సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన పవయ్య కుటుంబానికి విద్యుత్ సిబ్బంది ఆర్థిక సహాయం చేశారు. అందరూ కలిసి రూ.52 వేలు సేకరించి మృతుడి కూతురు పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. సంబంధిత పత్రాన్ని వారి కుటుంబానికి అందించారు. లక్షెట్టిపేట ఏడీఈ ప్రభాకర్‌రావు, జన్నారం సబ్ ఇంజనీర్ అజయ్, లైన్‌మన్ పూరెల్ల నాగన్న, శ్రీనివాస్, సిబ్బంది సంతోష్, రాజు, రమేష్, గంగన్న, సత్యం, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

కాసిపేట, ఫిబ్రవరి 29: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకే వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని ఓరియంట్ సిమెంట్ కంపెనీ యూనిట్ హెడ్ జోషి అన్నారు. గురువారం దేవాపూర్, గట్రావుపల్లి పంచాయతీ పరిధిలో మంచిర్యాల శ్రీహర ఆసుపత్రి సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నెలకు రెండు సార్లు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. 310 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు లక్ష్మీప్రసన్న, కంపెనీ హెచ్ఆర్ జీఎం ఆనంద్ కులకర్ణి, లైజనింగ్ అధికారి తిరుపతి, డాక్టర్ గౌతమ్, డాక్టర్ వినోద్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా డివైడర్ బ్లాక్‌లు

నస్పూర్, ఫిబ్రవరి 29: నస్పూర్ మున్సిపాలిటీలోని తోళ్ళవాగు నుంచి జీఎం కార్యాలయం వరకు జాతీయ రహదారి-63పై డీఎంఎఫ్‌టీ నిధులు దాదాపు రూ. కోటి రూపాయల వ్యయంతో మూడేళ్ళ కిందట వేసి డివైడర్ బ్లాక్స్ నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఇటీవల రోడ్డు విస్తరణలో భాగంగా వాటిని తొలగించి సిమెంట్‌తో డివైడర్ నిర్మించి అందులో మొక్కలు, ఇనుప కంచె, సెంట్రల్ లైటింగ్ దిమ్మెలను ఏర్పాటు చేశారు. కోటి రూపాయలకు పైగా ఖర్చు చేసి కొనుగోలు చేసిన డివైడర్ బ్లాక్స్ నస్పూర్ విలేజ్ వెళ్ళే మార్గంలో ఖాళీ స్థలంలో పడేశారు. వాటిని పెట్టడానికి, తీయడానికి అధిక వ్యయం అవుతుంది. వాటిని మరో చోటకు మార్చే ప్రయత్నాలను అధికారులు చేపట్టలేదు. గతంలో జాతీయ రహదారిపై డివైడర్ స్థానంలో బ్లాక్స్‌ను పెట్టారు. రోడ్డుపై ప్రయాణించే వాహనాలు తరచుగా డివైడర్లను ఢీకొని ప్రమాదాలు జరిగాయి. వాహనాలు డివైడర్ బ్లాక్ ను ఢీకొట్టి అవతలివైపు దూసుకెళ్ళిన సంఘటనలున్నాయి. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో అధికారులు డివైడర్ బ్లాక్‌ల స్థానంలో సిమెంట్ గోడతో నిర్మించాలని నిర్ణయించారు. జాతీయ రహదారి అధికారులు ప్రతిపాదనలు పంపిన మేరకు రోడ్డు విస్తరణతోపాటు సెంట్రల్ లైటింగ్, సిమెంట్‌తో డివైడర్ నిర్మించారు. అంతకు ముందు ఉన్న డివైడర్ బ్లాక్‌లను తొలగించారు. ప్రస్తుతం డివైడర్ బ్లాక్‌లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. డివైడర్ బ్లాక్‌లను మూలమలుపుల వద్ద ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఖాళీ స్థలంలో నిరుపయోగంగా పడి ఉన్న డివైడర్ బ్లాక్స్

ధరణి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 29: ధరణి సమస్యల పరిష్కారంపై జిల్లాలో మార్చి 1 నుంచి 9వ తేదీ వరకు రెవెన్యూప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని అదనపు కలెక్టర్ మోతిలాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ధరణి సమస్యల పరిష్కారానికి సీసీఎల్ఏ జిల్లాస్థాయి అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్‌లకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అధికారాలు బదలాయించడం జరిగిందన్నారు. ధరణిలో సవరింపు కొరకు జిల్లాలో 7,200 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయని, దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు అధికారులను మూడు టీంలుగా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 29: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,550 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 53మంది రైతులు 618క్వింటాళ్ల విడి పత్తి, ఆరుగురు రైతులు ఆరు క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,550, కనిష్ఠ ధర 6వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. బుధవారం క్వింటాల్ పత్తి 7,400 పలికింది.

సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి

అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతమయ్యేనా?

● కొత్త ప్రభుత్వంపైనే ఆశలు ● జిల్లాలో మొత్తం అంగన్‌వాడీలు 973
● టీచర్ల ఖాళీలు 86, హెల్పర్ల ఖాళీలు 257


చింతలమానేపల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 29: గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణుల సంక్షేమం కోసం అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర కీలకం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అంగన్‌వాడీకేంద్రాల్లో పూర్వప్రాథమికవిద్య అందించడంతో పాటు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తుంటారు. అయితే రెండేళ్లుగా వివిధ కారణాలతో ఖాళీగా ఉన్న టీచర్, ఆయా(హెల్పర్) పోస్టుల భర్తీలో జాప్యం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయినా ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలోని 15మండలాల పరిధిలో.. మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు 973 ఉండగా, టీచర్ల ఖాళీలు 86 ఉన్నాయి. ఆయా(హెల్పర్ల) ఖాళీలు 257 ఉన్నాయి. దీంతో నిరుద్యోగ యువతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటివరకు 887మంది టీచర్లు, 716మంది ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు. అయితే కొన్ని కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది లేక పోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పిల్లల శారీరక వికాసం, వివరాల నమోదులో కొంత జాప్యం నెలకొంటోంది. ఆయాలు లేని సెంటర్లలో భోజన తయారీ కొంత ఇబ్బందిగా ఉంటే.. టీచర్లు లేని చోట పిల్లలకు అక్షరాలు దిద్దించలేని పరిస్థితి నెలకొంది. త్వరితగతిన ఖాళీలను భర్తీ చేస్తే మెరుగైన ఫలితాలు చేకూరే అవకాశం ఉంది. ఇటీవల 101మంది అంగన్‌వాడీ టీచర్లకు అర్హతను బట్టి పదోన్నతి కల్పించారు. అయినా ఆయా కేంద్రాల్లో ఖాళీలు ఏర్పడ్డాయి వీటన్నిటినీ భర్తీ చేయాల్సి ఉంది.

నిబంధనలు మార్చడంతో..

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న ఖాళీలతో నిరుద్యోగ యువతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈసారి ఉద్యోగ ప్రకటన విడుదలైతే సేవలం దించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. తాజాగా ప్రభుత్వం ఖాళీల భర్తీకి మార్గదర్శకలు ఇచ్చింది. 65ఏళ్లు దాటిన మహిళల సేవలు వినియోగిం చుకోవద్దని స్పష్టం చేసింది. అలాగే హెల్పర్(ఆయా), టీచర్ పోస్టులకు ఇంటర్ పూర్తిచేసి 18నుంచి 35ఏళ్లలోపు వయస్సు ఉన్న వారే దరఖాస్తు చేసుకోవాలని నిబంధనలు పెట్టింది.

వైద్యం వికటించి మహిళ మృతి

ఆసుపత్రి ఎదుట కుటుంబీకుల ఆందోళన

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 29: వైద్యం వికటించి మహిళ మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని శ్రీనివాస నర్సింగ్ హోంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం చెన్నూరు పట్టణానికి చెందిన జోడు మధునక్క (42) నాలుగు రోజుల క్రితం మంచిర్యాలలోని శ్రీనివాస నర్సింగ్ హోంలో చేరింది. గర్భసంచికి గడ్డలు అయ్యాయని, ఆపరేషన్ చేసి వాటిని తొల గించాలని వైద్యులు తెలిపారు. రక్తం తక్కువగా ఉందని రెండు రోజుల నుంచి రక్తం ఎక్కించారు. బుధవారం మధ్యాహ్నం ఆపరేషన్ చేస్తామని చెప్పి ఆపరే షన్ థియేటర్‌లోకి తీసుకువెళ్లి సాయంత్రం 4 గంటలకు బయటకు తీసుకువచ్చి ఐసీయూలో ఉంచారు. అర్ధరాత్రి మధునక్క ఛాతిలో నొప్పి వస్తుందని, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగుతుందని భర్తకు చెప్పడంతో వైద్యులకు సమా చారం అందించాడు. ఆపరేషన్ తర్వాత చలి, హైబీపీతో బాధపడుతుందని వైద్యు లకు చెప్పినా నిర్లక్ష్యం చేశారన్నారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే మధునక్క మృతి చెందందని కుటుంబీకులు ఆసుపత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతురాలి కుటుంబీ కులకు నచ్చజెప్పి పంపించి వేశారు. మృతురాలుకు భర్త, ముగ్గురు కొడుకులు ఉన్నారు.

ఈవీఎంలపై ప్రజలకు అవగాహన

జన్నారం, ఫిబ్రవరి 29: జన్నారంలో గురువారం ఎన్నికలపై ప్రజలకు అవ గాహన కల్పించేందుకు ఎంపీటీసీ మహ్మద్ రియాజుద్దీన్ మాక్ పోలింగ్ నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఓటు వేసే విధానం, ఈవీఎంపై అవ గాహన కల్పించారు. మాక్ పోలింగ్‌లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాక్ సిబ్బంది సంతపురి సుధాకర్, కారోబార్ బాపన్న, ప్రజలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ


ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జీఎం

తాండూర్, ఫిబ్రవరి 29: మండలంలోని నర్సాపూర్ పునరావాస కాలనీలో గురువారం హనుమాన్ ఆలయ నిర్మాణానికి బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్ర సాద్ భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి నిధులతో ఆల యాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం సివిల్ సతీష్ బాబు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, మహేష్, ఎంపీటీసీ యశోద, జంగు పటేల్, జమున తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడితే సమాచారం అందించాలి


మాట్లాడుతున్న ఎస్ఐ రాజశేఖర్

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 29: కళాశాలలు, పాఠశాలల వద్ద విద్యార్థినులను ఎవరైనా వేధించినా, ఈవ్ టీజింగ్ చేసినా పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. పట్టణంలోని పాత బస్టాండ్ ఎస్సీ హాస్టల్‌లో షీటీంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థినీలు ధైర్యంగా ఉండాలని, ఎవరైనా ఆకతాయిలు వేదిస్తే భయపడకుండా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. షీటీం ఎస్ఐ హైమా మాట్లాడుతూ ఆకతాయిల ఆగడాలను అరికట్టేందుకు షీటీం పనిచేస్తుందని తెలిపారు. విద్యార్థినులు, మహిళలను ఎవరైనా ఆకతాయిలు వేదిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. లాయర్ అడ్వైజర్ సంధాని, అసిస్టెంట్ సుభాని, సదయ్యబ్లూకోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రక్తనమూనాల సేకరణ



జన్నారం, ఫిబ్రవరి 29 : మండలంలోని ఇందన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఫైలేరియా కేసులను గుర్తించడానికి గురువారం రక్తనమూనాలను సేకరించారు. డాక్టర్ ఉమాశ్రీ మాట్లాడుతూ గ్రామంలోని 300 మంది రక్తనమూనాలను సేకరించామని తెలిపారు. ఎవరికైనా ఫైలేరియా ఉంటే వారికి మెరుగైన వైద్య సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమారం: బోధకాలు నివారణకు గురువారం రాత్రి మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి రక్త నమూనాలను సేకరించినట్లు జైపూర్ మెడికల్ ఆఫీసర్ అనిల్‌కుమార్ తెలిపారు. 300 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించామని, బోధకాలు నిర్ధారణ అయితే వెంటనే మందులు అందజేస్తామని తెలిపారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంటరానితనాన్ని పూర్తిగా నిర్మూలించాలి


తాండూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 29: అంటరానితనాన్ని పూర్తిగా నిర్మూలించాలని తహసీల్దార్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం చిర్రకుంటలో పౌర హక్కుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరు వారి హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలని, హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. కుల రక్కసిని గ్రామాల్లో తరిమికొట్టాలని, గ్రామాల్లో కలిసి మెలిసి ఉండాలని సూచించారు. ఎస్ఐ రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు ఒడ్నాల కొమురయ్యగందె రాంచందర్, కార్యదర్శి శిరీష పాల్గొన్నారు.

హాజీపూర్: ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ సతీష్‌కుమార్ అన్నారు. నంనూర్‌లో సివిల్ రైట్స్‌డే నిర్వహించి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అందరు కలిసి మెలిసి ఉండాలని, ఎలాంటి గొడవలు, అల్లర్లకు పాల్పడవద్దని సూచించారు. ఎస్ఐ గోపతి నరేష్, డిప్యూటి తహసీల్దార్ హరిత, ఆర్ఐ మంగ పాల్గొన్నారు.

తాండూర్: బోయపల్లి గ్రామంలోజాతీయపౌర హక్కుల దినోత్సవాన్ని ఎంపీడీవో శ్రీనివాస్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతరాజ్యాంగం పౌరులకుఅనేక హక్కులు కల్పించిందని, ప్రజలు అవగాహన కలిగిఉండాలని సూచించారు. గ్రామాల్లోఅందరు కలసిమెలిసి ఉండాలన్నారు. రెవెన్యూఇన్‌స్పెక్టర్ అంజన్‌కుమార్,ఏఎస్ఐ లక్ష్మణ్, కార్యదర్శిరమేష్, ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్, మాజీసర్పంచు మిట్టవేణుగోపాల్,ప్రజలు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి


సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న ప్రభాకర్ యాదవ్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 29: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలందించాలని టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర వైస్ చైర్మన్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బండి ప్రభాకర్ యాదవ్ సూచించారు. గురువారం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రవికుమార్‌తో చర్చించారు. ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే వారిని సరిగ్గా పట్టించుకోవడం లేదని, రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సూపరింటెండెంట్ రవికుమార్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన సేవలందిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రిలోని పలు సమస్యలను విన్నవించగా ఎమ్మెల్యేతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభాకర్ యాదవ్ తెలిపారు.

ప్రారంభమైన ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలు


పరీక్ష కేంద్రం వద్ద లక్సెట్టిపేట సీఐ

ఏసీసీ, ఫిబ్రవరి 29: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. సెకండ్ లాంగ్వేజ్ పేపర్ 2కు జనరల్ విభాగంలో 5545 మంది విద్యార్థులు, ఒకేషనల్‌లో 1119 విద్యార్థులు మొత్తం 6664 మంది విద్యార్థులకుగాను 6414 మంది పరీక్షకు హాజరు కాగా 250 మంది గైర్హాజరయ్యారు. మొత్తం విద్యార్థుల్లో హాజరైన వారి శాతం 92.25 శాతం. జిల్లా వ్యాప్తంగా 25 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో శైలజ తెలిపారు.

జన్నారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని లక్సెట్టిపేట సీఐ అల్లం నరేందర్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులకు సూచనలు చేశారు. ఎస్ఐ సతీష్, సిబ్బంది ఉన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 177 మంది విద్యార్థులకు 170 మంది హాజరైనట్లు కళాశాల సిబ్బంది తెలిపారు.

జైపూర్: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ప్రిన్సిపాల్ కుమారస్వామి తెలిపారు. మొత్తం 336 మంది విద్యార్థులకు 335 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించామన్నారు.

దండేపల్లి: దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల, లింగాపూర్ ప్రభుత్వ ఆదర్శ కళాశాల చెందిన 231 మంది విద్యార్థులకుగాను 226 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు 5గురు గైర్హజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ బి.శోభ, డిపార్ట్‌మెంటల్ అధికారి బాపురావులు వెల్లడించారు. ఏఎస్సై శ్యాముల్ పాల్ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించి, పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

మందమర్రిరూరల్: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 278 మందికి 276 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణయ్యతెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం


ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 29: రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పల్లె రాజు మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీ పథకాలలో మరో రెండు పథకాలు రూ.500లకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను, సింగరేణి కార్మికుడు ప్రమద వశాత్తూ మరణిస్తే కోటీ రూపాయల ఇన్సూరెన్స్ వర్తించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించినా సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతూ క్షీరాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ ఎర్రం విద్యాసాగర్, కౌన్సిలర్లు పనసా రాజు, పొలం సత్యం, పూల్లురి సుధాకర్, కొక్కుల స్రవంతి, తదితరులు పాల్గొన్నారు

నర్సరీలను పరిశీలించిన ఎంపీడీవోలు


దహెగాంలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజేందర్

దహెగాం, ఫిబ్రవరి 29: మండలంలోని రాంపూర్, మొట్లగూడ, దిగిడగ్రామాల్లోని నర్సరీలను ఎంపీడీవో రాజేందర్ గురువారం పరిశీలించారు. నర్సరీల పనులు వేగవంతం చేయాలని, సంచులలో మట్టిని సక్రమంగా నింపి విత్తనాలు నాటాలన్నారు. విత్తనాలు మొలకెత్తే వరకు ప్రత్యేకశ్రద్ధ చూపాలన్నారు. ఆయన వెంట టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

కెరమెరి: వచ్చే జూన్ కల్లా మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. గురువారం ఆయన తుమ్మగూడ, అనార్‌పల్లి గ్రామ పంచాయతీల్లో నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలకు ఎండ తగలకుండా నెట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట కార్యదర్శులు ఉన్నారు.

సిర్పూర్(టి): ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని హుడ్కిలి, జక్కాపూర్, నవేగాం గ్రామ పంచాయతీల్లో నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో నీటిఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఇంటికి నల్లానీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. ఆయనవెంట ఏపీఎం రామ్మోహన్‌రావు, కార్యదర్శులు ఉన్నారు.

శాంతిభద్రతలు కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత: ఎస్పీ


పట్టణంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న ఎస్పీ సురేష్ కుమార్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 29: సమాజంలో శాంతి భద్రతలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్పీ ఎ సురేష్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలో ర్యాపిడ్ యాక్షన్‌ఫోర్సు కేంద్ర భద్రత బలగాల మార్చ్‌ను పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎలాంటి వర్గ భేదాలు, అల్లర్లు లేకుండా ఉండేందుకు జిల్లాలో ఆయాప్రాంతాల్లో అవగాహన సదస్సులు, కవాతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించాలని చూసినా వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఈ కవాతు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. కార్యక్రమంలో ఆర్ఎఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ జితేందర్ నందావార్, ఇన్‌స్పెక్టర్ ప్రధాన్‌రమేష్ సీఐ సతీష్, టాస్క్‌ఫోర్సు సీఐ రాణా ప్రతాప్, సీఐ రమేష్, ఆర్ఐ పెద్దన్న, అంజన్న తదితరులున్నారు.

జిల్లాలో 30 పోలీసు యాక్టు అమలు..

జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా ప్రశాంతతను పెంచేందుకు శుక్రవారం నుంచి మార్చి 31వరకు జిల్లా అంతటా 30 పోలీసు యాక్టు అమల్లో ఉంటుం దని ఎస్పీ సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

అనుమానాస్పదంగా వివాహిత మృతి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 29: మండలంలోని గన్నారం గ్రామపంచాయతీ మండువలో నివాసం ఉంటున్న కుమ్మరి రోజా(25) బుధవారం అనుమానాస్పదంగా మృతి చెందినట్లు రూరల్ సీఐ నాగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రోజాకు ఐదు సంవత్సరాల క్రితం వివాహమైంది. భర్తతో విడాకులు తీసుకొని తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. బుధవారం తల్లిదండ్రులు వేరే గ్రామానికి వెళ్లి గురువారం ఉదయం ఇంటికి వచ్చేచూసే సరికి రోజా ఇంట్లో కన్పించలేదు. ఆమె కోసం వెతకగా పెరటిలో మృతదేహం కన్పించింది. ఈ మేరకు మృతురాలి తల్లి కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

నా కూతురిని హత్య చేశారు..

నా కూతురిని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని మృతురాలి తల్లి కమల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము ఇంట్లో ఎవరూ లేని సమయంలో పెరటిలో చంపేశారని తెలిపారు. తన కూతరి మృతి పట్ల పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరిపి తగిన న్యాయం చేయాలని రోదిస్తూ తెలిపింది.

మేకను హింసించిన వ్యక్తిపై కేసు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 29: స్థానిక ఓల్డు కాలనీకి చెందిన నరసింహప్రసాద్ ఇంటి పక్కన మేత మేస్తున్న మేకను హింసించినందుకు గురువారం కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మహ్మద్ అజర్‌కు చెందిన మేక మేత మేస్తూ నరసింహప్రసాద్ ఇంటి వైపునకు వెళ్లింది. మేక అరుపులు వినిపించటంతో అజర్ కుటుంబ సభ్యులు ప్రసాద్ ఇంటి వద్దకు వచ్చి చూశారు. మేక వెనుక భాగంలో రక్తం కారుతుండటంతో నరసింహప్రసాద్ తీవ్రంగా కొట్టి మేకను గాయపర్చాడని అజర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

శివమల్లన్న స్వామి ఆలయ కమిటీ


ఎన్నికైన కమిటీ సభ్యులు

కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 29: కాగజ్‌నగర్ మండలంలోని ఈస్‌గాం శ్రీ శివమల్లన్నస్వామి జాతర కమిటీని గురువారం నియోజవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మైలవరపు మురళీధర్, సభ్యులుగా ఎమ్మాజి శారద, హరిప్రసాద్‌సోని, శృంగారపు ప్రసాద్, జెరుపుల తిరుపతి, రాంటెంకి సత్తయ్య ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో, నాయకులు రావి మురళీకృష్ణ, వార్ల తిరుపతి, చిలువేరు సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

దహెగాం, ఫిబ్రవరి 29:: మండలంలోని చౌక,పంబాపూర్ గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణపనులను గురువారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. గ్రామాలు సీసీరోడ్ల నిర్మాణంతో అభివృద్ధి చెందుతాయన్నారు. చౌక గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10లక్షలు, పంబాపూర్‌లో రూ.5లక్షలతో సీసీరోడ్లనిర్మాణం చేపడుతున్నామన్నారు.


పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఓటీఎస్ చెల్లింపునకు అవకాశం

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 29: మున్సిపల్ ఆస్తిపన్ను 2022-23వరకు వన్‌టైం సెటిల్‌మెంటు(ఓటీఎస్) పద్ధతిన ఒకేసారి చెల్లిస్తే పన్ను బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ జరుగుతుందని కమిషనర్ అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని ఆయన కోరారు.

యాసంగి పంటల పరిశీలన

సిర్పూర్(టి), ఫిబ్రవరి 29: మండలంలోని హుడ్కిలి, జక్కాపూర్, నవేగాం గ్రామాల్లో యాసంగిలో సాగుచేస్తున్న పంటలను గురువారం ఏవో మధులత పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు.

గ్లైసిల్ విత్తనాలు అమ్మితే కఠినచర్యలు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 29: గ్లైసిల్‌విత్తనాలు అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ అన్నారు. గురువారం స్థానికంగా విత్తనడీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విత్తన డీలర్లు విక్రయాల విషయంలో నిబంధనలు పాటించాలన్నారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు బోర్డుపై పెట్టాలన్నారు. ఈ సందర్భంగా డీలర్ల లైసెన్సును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. సమావేశంలో విత్తన డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీ కొని ఒకరు మృతి


గాదం భీమయ్య(ఫైల్)

సిర్పూర్(టి), ఫిబ్రవరి 29: మండలకేంద్రంలోని గొల్లవాడకు చెందిన గాదం భీమయ్య(53) గురువారం చీలపల్లి గేటు వద్ద రైల్వేట్రాక్ దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని రైలు ఢీకొని మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీ సులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీ లించారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



డీఎస్సీలో పెరిగిన పోస్టులు



- రెండేళ్లకు వయస్సు పెంచడంతో పెరగనున్న అభ్యర్థుల సంఖ్య
- నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం
- మంచిర్యాల జిల్లాలో 288 పోస్టులు

ఏసీసీ, ఫిబ్రవరి 29: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నది. గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేసి 11062 పోస్టులతో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి విద్యా శాఖాధికారులు, మంత్రులతో కలిసి కొత్త నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా పోస్టుల సంఖ్యను కూడా వెల్లడించారు. స్కూల్ అసిస్టెంట్, భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఎస్జీటీ పోస్టులతో పాటు కొత్తగా స్పెషల్ ఎడ్యూకేషన్ పోస్టులను భర్తీ చేస్తున్నారు. గతంలో డీఎస్సీ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మరల దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి ఏప్రిల్ 3వ తేదీ వరకు అవకాశం కల్పించారు. అలాగే దరఖాస్తు చేసుకునేందుకు వయసు మరో రెండేళ్లు అదనంగా పెంచారు. ఓసీ అభ్యర్థులకు 46 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 51 ఏళ్లు, దివ్యాంగులకు 56 ఏళ్ల వరకు అవకాశం కల్పించారు. గత ఏడాది జూలై 1వ తేదీ నాటికి కట్ ఆఫ్ డేట్ పెట్టారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలి.

● మంచిర్యాల జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 70, లాంగ్వేజ్ పండిట్ పోస్టులు 16, ఫిజి కల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు 3, సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 176, మొత్తం 265 సాధారణ టీచర్ పోస్టులతో పాటు స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 5, స్పెషల్ ఎడ్యుకేషన్ సెకం డరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 18, రెండు విభాగాల్లో కలిపి 23 పోస్టులు, అన్ని టీచర్ పోస్టులు కలిపి జిల్లాలో 288 ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. స్కూల్ అసి స్టెంట్ పోస్టుకు బీఈడీ, ఎస్‌జీటీ పోస్టుకు టీటీసీ, లాంగ్వేజ్ పండిట్ పోస్టులకు టీపీటీ, హెచ్‌పీటీ ఉత్తీర్ణత తోపాటు టెట్ క్వాలిఫై అయి ఉండాలి. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ ట్రైనింగ్ పూర్తిచేసి ఉండాలని నిబంధన విధించారు.

రాష్ట్ర వ్యాప్తంగా 11 కేంద్రాల్లో నియామక పరీక్ష

నియామక పరీక్షను రాష్ట్ర వ్యాప్తంగా 11 కేంద్రాల ద్వారా కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్టు ద్వారా నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని పాత పది జిల్లా కేంద్రాలతోపాటు సంగారెడ్డిలో 1, మొత్తం 11 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. పరీక్ష తేదీలను త్వరలో ప్రకటించనున్నారు.

పెరగనున్న అభ్యర్థుల సంఖ్య..

గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతోపాటు మరికొంత మంది అభ్యర్థులు పెరగను న్నారు. ఇందుకు కారణం దరఖాస్తు చేసుకునే వారి నిర్ధిష్ట వయస్సును 44 ఏళ్ల నుంచి 46 ఏళ్లకు పెంచారు. అంతేగాకుండా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు విద్యా బోధన చేసేందుకు కొత్తగా పోస్టులను ప్రవేశ పెట్టారు. దీంతో బీఈడీ, డీఈడీ స్పెషల్ ఎడ్యూకేషన్ కోర్సు చేసిన వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం లభించింది. పాత నోటిఫికేషన్‌లో ప్రకటించిన పోస్టులకు తోడు మరిన్ని పోస్టులను కలిపి నోటిఫికేషన్ జారీ చేయడంతో అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



టెట్ రాస్తున్న అభ్యర్థులు (ఫైల్)

ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 29: జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 3 నెలల ఫౌండేషన్ కోర్సునకు నిరుద్యోగ అభ్యర్థులకు రెసిడెన్షియల్ పద్ధతిలో ఉచిత భోజన వసతితో కూడిన శిక్షణ అందిస్తామని, అర్హత గల వారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డు కులాల శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 6వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని, మార్చి 10న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9441333348లో సంప్రదించాలన్నారు.

పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 29 : పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి సుబ్బారాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్స్ పోలియో కేంద్రాలతో పాటు కార్యక్రమాల నిర్వహణకు సూపర్‌వైజర్లు, మొబైల్ బృందాలను నియమించామన్నారు. బస్టాండ్, రైల్వేస్టేషన్‌లు, వివిధ కూడళ్లలో వ్యాక్సినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. మార్చి 3వ తేదీన వ్యాక్సినేషన్ కానీ పిల్లలకు 4, 5 తేదీల్లో ప్రతి ఇంటిని సందర్శించి పిల్లలకు వ్యాక్సిన్ వేస్తామన్నారు. మార్చి 3న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పల్స్ పోలియో కేంద్రాలు నిర్వహిస్తామని, విజయవంతం చేయాలని కోరారు.

సంఘవిద్రోహ శక్తులకు సహకరించవద్దు

కోటపల్లి, ఫిబ్రవరి 29: సంఘ విద్రోహ శక్తులకు సహకరించి యువత భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. గురువారం వెంచపల్లి ఫెర్రీ పాయింట్‌ను డీసీపీ సుధీర్‌రాంనాథ్‌కేకన్‌తో కలిసి సందర్శించారు. పడవలు నడిపే, చేపలు పట్టే వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలోని సమస్యలు, మావోయిస్టుల కదలికలపై ఆరా తీశారు. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటారని, యువత బాగా చదువుకుని ఉద్యోగాలు సాధించాలన్నారు. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన ప్రాణహిత పరివాహక ప్రాంతంలో ప్రత్యేక నిఘా ఉంటుందని, డ్రోన్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉండవచ్చని, లొంగిపోయిన వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, ఇందుకు తమ అండ ఉంటుందన్నారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, కోటపల్లి, నీల్వాయి, చెన్నూరు ఎస్‌ఐలు రాజేందర్, సుబ్బారావు, రవీందర్ పాల్గొన్నారు.

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

వేమనపల్లి: పోలీసులు ప్రజలకు రక్షణ కల్పించేందుకు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని రామగుండం సీపీ శ్రీనివాసులు సూచించారు. నీల్వాయి పోలీస్‌స్టేషన్‌ను డీసీపీ సుధీర్‌రాంనాథ్‌కేకన్‌తో కలిసి సందర్శించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో భవన నిర్మాణ పనులను పరిశీలించారు. గుత్తేదారుతో మాట్లాడి త్వరగా పూర్తయ్యేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం సీపీ పోలీసు అధికారులతో మాట్లాడుతూ ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. విధుల్లో అప్రమత్తంగా ఉంటూ క్రమ శిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని చెప్పారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని మావోయిస్టు ప్రభావిత గ్రామాల వివరాలు, ప్రస్తుత పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. ప్రాణహిత నదిలో పడవలు నడిపే వారి వివరాలను సేకరించారు. మావోయిస్టు సానుభూతిపరులు, మిలిటెంట్లు, మావోయిస్టులకు సంబంధించిన వారి కదలికలు ఏమైనా ఉన్నాయా అని తెలుసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసులు కృషి చేయాలన్నారు. చెన్నూరు, నీల్వాయి, కోటపల్లి ఎస్‌ఐలు రవీందర్, సుబ్బారావు, మహేందర్, తదితరులు ఉన్నారు.



పడవల యాజమానులతో మాట్లాడుతున్న రామగుండం సీపీ శ్రీనివాసులు



నీల్వాయి పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీసులకు సూచనలు ఇస్తున్న సీపీ శ్రీనివాసులు

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 29: మత్తు పదార్థాలు, మద్య పానీయాల విని యోగం యువత భవిష్యత్‌కు నిరోధకమని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్, బెల్లంపల్లి ఆర్డీవో హరి కృష్ణ, డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు, ఆబ్కారీ శాఖ పర్యవేక్షకులు నంద గోపాల్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్‌లతో మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యువత మద్యానికి, మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. జిల్లాలో గంజాయి సాగు జరగకుండా అటవీ, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సమ న్వయంతో పర్యవేక్షించాలన్నారు. మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాలు రవాణా చేసే వారికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా పడుతుందన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మత్తు పదార్థాలు నిల్వ ఉన్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి కల్పన, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి, అధికారులు పాల్గొన్నారు.

చెన్నూరు: కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన, జంతుశాస్త్రం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో వచ్చే చెడు పరిణామాలు, అనర్థాల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి, అధ్యాపకులు జగ్‌పాల్, కృష్ణగోపాల్, శ్రీనివాస్, సర్వర్‌పాషా , విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

పశుగ్రాసం పెంపకంపై అవగాహన

దండేపల్లి, ఫిబ్రవరి 29: మండలంలోని మాదాపూర్‌లో ఎంపీటీసీ సభ్యుడు కొంగల నవీన్, మండల పశువైద్యాధికారి ధన్‌రాజ్ ఆధ్వర్యంలో 'పశుగ్రాస పెంపకం, పశువులలో కృత్రిమ గర్భధారణ' అవగాహన కల్పించారు. నాణ్యమైన పశుగ్రాసాలు, సూపర్ నేపియర్, హెడ్జ్‌లాసన్, అలిగ రకాలను రైతులు పశువులకు మేతగా వేయాలని కోరారు. పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించడం వలన మేలు రకాలైన పశుసంపదను సృష్టించి రైతులు ఆర్థికంగా లాభపడవచ్చని సూచించారు. పశువైద్య సిబ్బంది రాజయ్య, శ్రావణ్, ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

డీఈవోను సస్పెండ్ చేయాలి

ఏసీసీ, ఫిబ్రవరి 29: ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలుకుతున్న జిల్లా విద్యాశాఖ అధికారిని సస్పెండ్ చేయాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమవేదిక, జాతీయ విద్యార్థి సమాఖ్య నాయకులు అన్నారు. గురువారం ఐబీ గెస్ట్‌హౌజ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ లక్సెట్టిపేట మండల కేంద్రంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి అడ్మిషన్‌ల పేరుతో డబ్బులు వసూలు చేసేందుకు తెర లేపిందన్నారు. జిల్లాలో అనుమతులు లేకుండా కార్పొరేట్ విద్యాసంస్థలు వెలుస్తున్నా డీఈవో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. డీఈవోను సస్పెండ్ చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, వంశీ, శేఖర్,సాయి, రాము, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనం పరిశీలన



భీమారం, ఫిబ్రవరి 29 : భీమారంలోని పల్లెప్రకృతి వనాన్ని గురువారం ఎంపీడీవో రాథోడ్ రాధ, మండల స్పెషల్ ఆఫీసర్ చిన్నయ్యలు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రకృతి వనంలో మొక్కలు ఏపుగా పెరిగేలా చూడాలని, ఎండాకాలం సమీపించినందున మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలని, నీరు సమృద్ధిగా పోయాలని, చలువ పందిల్లు వేయాలని సూచించారు. కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ బన్సీలాల్ పాల్గొన్నారు.

ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలి

జన్నారం, ఫిబ్రవరి 29: పదో తరగతి విద్యార్థులు భయపడకుండా, ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని డీఈవో యాదయ్య పేర్కొన్నారు. గురువారం జన్నారంలో విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు పరీక్షలంటే భయం వీడేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విషయ నిపుణులు అందించే సూచనలు, సలహాలు పాటిస్తే మంచి మార్కులు సాధించవచ్చువచ్చన్నారు. ఎంపీడీవో శశికళ, ఎంఈవో విజయ్‌కుమార్, తహసీల్దార్ రాజ్ మనోహర్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, ఎంపీవో రమేష్, విషయ నిపుణులు, సైకాలజిస్టులు, ప్రధానోపాధ్యాయులు రాజమౌళి, రామన్న, రాజేందర్, శ్రీనివాస్, మురళీదర్, ప్రభావతి, కమలాకర్, కిషన్ పాల్గొన్నారు.

దండేపల్లి: విద్యార్థులు భయం వీడితేనే పరీక్షలు బాగా రాయవచ్చని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ అన్నారు. పదో తరగతి విద్యార్థులకు ముత్యంపేట ఎఎల్ ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రేరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భయాన్ని జయిస్తేనే పరీక్షల్లో విజయం సాధించవచ్చన్నారు. ప్రతీ సబ్జెక్టుపై అవగాహన పెంచుకోవాలన్నారు. వంద శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలని అధికారులకు చెప్పారు. మండల నోడల్ అధికారి డి.చిన్నయ్య, జెడ్పీటీసీ గడ్డం నాగరాణి, ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో శ్రీనివాస్, క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి, రిసోర్స్ పర్సన్స్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య, సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



సభ్యత్వ నమోదు చేస్తున్న పీఆర్‌టీయూ తెలంగాణ నాయకులు

ఏసీసీ, ఫిబ్రవరి 29 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్వతి సత్యనారాయణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని చెన్నూరు రోడ్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీపీఎస్ రద్దు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానం అమలు, పెండింగ్ డీఏ, బిల్లులు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం పలువురికి సభ్య త్వం అందించారు. అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు దరణికోట వేణుగోపాల్, సూరినేని గంగాధర్, లక్ష్మీ నారాయణ, సాంబయ్య, వెంకటేష్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ఏసీసీ, ఫిబ్రవరి 29 : కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తుందని బీజేపీ సీనియర్ నాయకులు తుల మధుసూదన్‌రావు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌లు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీసీల అభివృద్ధికి లక్ష కోట్లు ఖర్చు చేస్తామని ఇటీవల బడ్జెట్‌లో కేవలం రూ.8 వేల కోట్లు కేటాయించడం సరైంది కాదన్నారు. వెంటనే బీసీలకు లక్ష కోట్లు కేటాయించి బీసీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నాయకులు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 29: బెల్లంపల్లి మండలంలోని మాలగురిజాలలో గురువారం ట్రాక్టర్ యూనియన్ మండల సభ్యులు నిరసన చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షుడు బండెల మురళి మాట్లాడుతూ 20 రోజులుగా ఖర్జీ ఇసుక రీచ్ నుంచి తరలించే ట్రాక్టర్లకు ట్రిప్పులు లేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ నుంచి అనుమతులు ఉన్నప్పటికి ఇసుకను తరలిస్తుండగా ప్రజలు అడ్డుకుని టిప్పులు కొట్టకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. దీంతో ట్రాక్టర్‌ల ఫైనాన్స్‌లు కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. బెల్లంపల్లిలో ఇసుక రవాణా సాఫీగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నెన్నెల మండలానికి సంబంధం లేకుండా కేవలం బెల్లంపల్లి ట్రాక్టర్లు మాత్రమే ఇసుక ట్రిప్పులు కొట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సభ్యులు రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ

నస్పూర్, ఫిబ్రవరి 29: నస్పూర్ మున్సిపాలిటీలో ఆర్థిక సంవత్సరం 2022-23 వరకు ఉన్న ఆస్తి పన్ను బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందని కమిషనర్ సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. వాణిజ్య, నివాస గృహాల యజమానులు మార్చి 31 లోపు ఆస్తి పన్ను చెల్లించి 90 శాతం వడ్డీ మాఫీని పొందాలన్నారు. పట్టణంలోని గృహాల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైస్ ఎంపీపీ ఎన్నిక వాయిదా

భీమారం, ఫిబ్రవరి 29: భీమారం మండల వైస్ ఎంపీపీ ఎన్నిక గురువారం జరగాల్సి ఉండగా సభ్యుల గైర్హాజరుతో వాయిదా పడిందని ఎన్నికల అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ చిన్నయ్య తెలిపారు. వైస్ ఎంపీపీ పదవి ఖాళీ కావడంతో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు గురువారం ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. ముగ్గురు ఎంపీటీసీలు ఉండగా ఒక్కరు కూడా హాజరు కాకపోవడంతో ఎన్నిక వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేస్తామని వారి అనుమతితో మళ్లీ ఎన్నిక నిర్వహిస్తామన్నారు. ఎంపీడీవో రాథోడ్ రాధ, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకాన్ని పాఠశాలలకు అమలుచేయాలి



మాట్లాడుతున్న తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

కోటపల్లి, ఫిబ్రవరి 29: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహ జ్యోతి పథకాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వర్తింపజేసి ఉచిత విద్యుత్ అందించాలని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. గురువారం దేవులవాడలో సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ 200 యూనిట్లలోపు వాడే పేద వారికి ప్రభుత్వం గృహజ్యోతి పథకం అమలు చేయడాన్ని హర్షిస్తున్నామని, పేదవారిని గుర్తించడంలో ప్రభుత్వం సరైన ప్రమాణాలు పాటించాలన్నారు. పాఠశాలకు సంబంధించిన విద్యుత్ బకాయిలను రద్దు చేయాలని కోరారు. సంఘం నాయకులు భూమయ్య, మల్లేష్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైవే అలైన్‌మెంట్ మార్చాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

హాజీపూర్, ఫిబ్రవరి 29: గ్రీన్‌ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్ మార్చాలని గురువారం గుడిపేట రైతులు తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అధికారులు సర్వేలు చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేను పొలాల మీదుగా కాకుండా జాతీయ రహదారి వెంబడి విస్తరణ చేయాలని కోరారు. రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా

చెన్నూరు, ఫిబ్రవరి 29: పట్టణంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ సాధారణ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పట్టణంలోని పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. పట్టణంలో పేరుకుపోయిన సమస్యలపై కౌన్సిల్ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కమిషనర్ గంగాధర్, వైస్ చైర్మన్ నవాజుద్దీన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.